క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలు తెలియజేసేందుకు, సలహాలు సూచనలు ఇచ్చేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ జి. రాజేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. సమస్యలు తెలియజేయదలచినవారు 99592 25464కు డయల్ చేయాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పామర్రు: స్థానిక సాయినగర్‌లోని శ్రీ షిర్డి సాయి మందిరం 31వ ప్రతిష్ట వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో బాబాకు ఆవుపాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని అలంకరించి పూజలు చేశారు. తదుపరి వచ్చిన భక్తులతో సామూహిక సత్యసాయి వ్రతాలను ఆచరించారు. అనంతరం అన్న సమారాధన చేశామని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త తమ్మా వినోద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భక్త సమాజ మండలి సభ్యులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, సాంబశివరావు, జగన్‌మోహన్‌రావు, మల్లికార్జునరావు, సాయి, రాధాకృష్ణ, సురేష్, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి రేషన్ షాపుల్లో నిత్యావసరాల పంపిణీ

పమిడిముక్కల: రేషన్ పంపిణీ చేసే వాహనాలు రద్దు చేసినందున జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. రేషన్ షాపుల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు నిత్యావసరాల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా రాజగోపాల స్వామి వార్షిక కల్యాణోత్సవం



మండవల్లి: అల్లినగరంలో రాజగోపాల స్వామి వార్షిక కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం, పంచామృతం, మండపారాధన, స్వామికి విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు శాంతి కల్యాణం, వైఖానస ఆగమం ప్రకారం వైభవంగా జరిపారు. దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి దివ్యశ్రీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శరత్‌బాబు, గౌతమ్‌కుమార్, భాస్కర్ గోపాల్ బృందం ఆధ్వర్యంలో ముదినేపల్లి డీసీ చైర్మన్ నారగాని వెంకట నాగేశ్వర రావు దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



పమిడిముక్కల: మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం 23 గ్రామాల్లో జరిగిన పనుల్లో 4,413 మంది కూలీలు పాల్గొన్నారని ఉపాధి పథకం ఏపీఓ లక్ష్మిరెడ్డి తెలిపారు. పంట కాలువలు, పంట బోదెల పూడికతీత పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఆన్‌లైన్ భద్రతపై అవగాహన



పమిడిముక్కల: కృష్ణాపురం ఎస్సీ కాలనీలోని అంగనవాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మన్నే ఝాన్సీరాణి ఆర్థిక అంశాలు పొదుపు నిర్వహణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత సమస్యలపై ఎంఎస్‌కే శ్రీదేవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్త ప్రశాంతి పాల్గొన్నారు.

అన్నసమారాధన

కైకలూరు: హనుమజ్జయంతోత్సవాల ముగింపు సందర్భంగా వింజరం మిల్లు సమీప అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన శుక్రవారం జరిగింది. రెండు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ నాయకులు అంబటి కృష్ణారావు, ఫరుశురామయ్య, సాంబశివరావు, శ్యామలరావు, మహమ్మద్ కమ్రుద్దీన్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జోరుగా బుసక దందా!

- రొయ్యూరు వద్ద పట్టాభూముల్లో
- యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



రొయ్యూరులో బుసక తవ్వకాలు జరిపిన ప్రాంతం

తోట్లవల్లూరు: కృష్ణానది తీరాన బుసక దందా జోరుగా సాగుతోంది. కూటమి నాయకుల ఆశీస్సులు, అధికారుల అండదండలతో మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ఎలాంటి అనుమతులు లేకున్నా కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా బుసక తవ్వకాలు నిర్వహిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. తోట్లవల్లూరు మండలంలోని రొయ్యూరు రెవెన్యూ ఏరియా పరిధిలో బుసక అక్రమ తవ్వకాలు కొన్ని రోజులుగా జోరుగా సాగుతున్నాయి. రైతుల వద్ద పట్టాభూములు కొనుగోలు చేసి, వల్లూరుపాలెం పాత ర్యాంప్ నుంచి కృష్ణానది పాయలో తాత్కాలిక బాట ఏర్పాటు చేసి మరీ బుసక రవాణను నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల సహకారం, అధికారుల అండదండలతో బుసక దందా ఊపందుకుంది. నిన్న, మొన్నటి వరకు వర్షాల కారణంగా మందకొడిగా సాగిన బుసక రవాణ మళ్లీ ఊపందుకుంది.

అడ్డగోలుగా తవ్వకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బుసక తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ఎక్కడ పడితే అక్కడే అధికార పార్టీ నాయకుల ఆశీస్సులతో వారి అనుచరగణం బుసక తవ్వకాలు అడ్డగోలుగా నిర్వహిస్తోంది. గతంలో మండలంలోని చాగంటిపాడు, దేవరపల్లి, పాములలంక ప్రాంతాల్లో బుసక తవ్వకాలు యథేచ్ఛగా జరిపినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. తాజాగా రొయ్యూరులో కూడా ఎలాంటి అనుమతులు లేకుండా బుసక తవ్వకాలు జరుపుతున్నా నిరోధించే వారు కరువయ్యారనే విమర్శలున్నాయి.



బుసక రవాణ కోసం ఏర్పాటు చేసిన బాట

చీకటి రవాణా

బుసక తవ్వకాలను రాత్రి వేళల్లో నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రి ఏడు గంటల నుంచి తెల్లవారు జామున ఐదు గంటల వరకు బుసక తవ్వకాలు జరిపి లారీల ద్వారా తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో లారీ బుసకను రూ. 2,500 నుంచి రూ. 3 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఎలాంటి అనుమతులు లేకుండా బుసక తవ్వకాలు జరుపుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడంలేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ బుసక తవ్వకాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేవు

రొయ్యూరులో బుసక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. బుసక తవ్వకాల నిర్వహణకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. బుసక తవ్వకాల విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై చర్యలు తీసుకుంటాం.

– ఎం.కుసుమకుమారి, తహసీల్దార్, తోట్లవల్లూరు

రైతులను సాగుకు సమాయత్తం చేయండి

కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాస్త్రవేత్త యశ్వంత్‌కుమార్



మాట్లాడుతున్న యశ్వంత్‌కుమార్

గుడివాడరూరల్: ఖరీఫ్ సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం(ఘంటసాల) మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్‌కుమార్ అన్నారు. గుడివాడ మార్కెట్‌యార్డ్‌లో కేంద్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగే వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ ప్రీ ఖరీఫ్ కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేవీకే నిర్వహించే కార్యక్రమాలు, లభ్యమయ్యే విత్తనాలు, భూసార పరీక్షల వివరాలను రైతులకు వివరించి సాగుపై ఆసక్తి పెంచాలని సూచించారు. భూమి, భూసార పరీక్ష, నీరు–నీటి పరీక్షల ప్రాముఖ్యత, సాగులో మెలకువలు, పంటల ఎంపిక, అధిక దిగుబడులు ఇచ్చే పంట రకాలు, యాంత్రీకరణ సౌలభ్యం, పంటల యాజమాన్యం, సస్యరక్షణ తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించాలన్నారు. వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త(మచిలీపట్నం) కె.నాగేంద్ర రావు మాట్లాడుతూ వరిలో నూతన వంగడాలు, వివిధ నేలలకు అనువైన వరి రకాల గురించి, వాటిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. భారతీయ ఆయిల్ పామ్ పరిశోధన శాస్త్రవేత్త(పెదవేగి) డాక్టర్ సుబ్బన్న ఆయిల్ పామ్ సాగు గురించి, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుడివాడ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, ఉద్యాన శాఖాధికారి జె.కీర్తి, ఏఓ బోలెం అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలపై దాడులు దారుణం

గుడివాడ టౌన్: టీడీపీ గూండాలు మైనార్టీ నాయకులపై దాడులు చేయడం నీచమైన చర్య అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మండలి హనుమంతరావు అన్నారు. శుక్రవారం ఆయన మైనార్టీ సెల్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ముస్లిం మైనార్టీ సెల్ డైరెక్టర్‌గా సేవలందించిన షేక్ సయ్యద్ పార్టీని వీడకుండా మైనార్టీ నాయకులను పార్టీలోకి ఆకర్షించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 29న పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో మైనార్టీల సమావేశంలో పాల్గొనేందుకు 28వ తేదీ రాత్రి గుడివాడ నుంచి బయలుదేరి నందివాడ మండలం కుదరవల్లి గ్రామం మీదుగా ఏలూరు వెళుతుండగా ఏడుగురు వ్యక్తులు ఏలూరు సమీపంలోని పెదపాడు గ్రామం వద్ద సయ్యద్ వాహనాన్ని అనుసరించారన్నారు. ఒక్కసారిగా బండిని ఆపి దాడికి దిగారని తెలిపారు. 'పలుమార్లు హెచ్చరించినా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటావా అంటూ' దాడి చేశారని, తలకు గాయమై ఏడు కుట్లు పడ్డాయని సయ్యద్ తెలపడం బాధాకరమన్నారు. టీడీపీ గూండాలు ఈ విధమైన కార్యక్రమాలను మానుకోకపోతే తిరిగి గట్టిగా సమాధానం చెప్పాల్సి వస్తుందని హనుమంతరావు హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ గుడివాడ అధ్యక్షుడు షేక్ షమ్ము, మాజీ అధ్యక్షుడు షేక్ బాజి, నాయకులు కె. ఆంజనేయ ప్రసాద్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను అందజేస్తున్న జిల్లా అధికారి మనోహర్‌రావు

పామర్రు: నేల ఆరోగ్యానికి అనుగుణంగా పోషక యాజమాన్య పద్ధతులను అనుసరిస్తే వరి సాగులో అధిక దిగుబడులు సాధించ వచ్చని కృష్ణాజిల్లా వ్యవసాయ అధికారి మనోహర్‌రావు పేర్కొన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ రంగాల సమన్వయంతో వికసిత కృషి సంకల్ప అభియాన్ అనే అవగాహన కార్యక్రమం శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మనోహర్‌రావు మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే ఎరువుల యాజమాన్యం చేపట్టాలన్నారు. పురుగుమందుల వినియోగించడం తగ్గించుకుని అవశేష రహిత పంట ఉత్పత్తులను పొందాలని పేర్కొన్నారు. జిల్లా నోడల్ అధికారి, కేవీకే సమన్వయ కర్త డాక్టరు డి.సుధారాణి మాట్లాడుతూ ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా జూన్ 12వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో జరుగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందజేసే సబ్సిడీలు తదితర అంశాలను రైతులకు నేరుగా వారి గ్రామాల్లో తెలియజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత, ఏఓ శివనాగరాణి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ, భారతీయ ఆయిల్ పామ్ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ అనిత, శాస్త్రవేత్తలు రేవతి, శైలజరాణి, మండల వ్యవసాయ అధికారి పద్మజ పాల్గొన్నారు.



మొవ్వలో సూచనలిస్తున్న డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి

మేలు రకాల విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

మొవ్వ: సార్వా పంటకు అనువైన వరి రకాలు ఎంటీయూ 1061, ఎంటీయూ 1318, ఎంటీయూ 1224ను ఎంచుకోవాలని ఘంటశాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి(సస్య పోషణ) సూచించారు. స్థానిక క్షేత్రయ్య కల్యాణ మండపంలో శుక్రవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొవ్వ సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ శ్యామల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భారతీయ వ్యవసాయి పరిశోధనా స్థానం పెదవేగి శాస్త్రవేత్త డాక్టర్ కళ్యాణ్ బాబు మాట్లాడుతూ రైతులకు ఆయిల్ పామ్ సాగుకు మండలంలోని వ్యవసాయ భూములు అనువుగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కంచర్ల శివప్రసాద్, డీఎంపీ రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: గుడివాడ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జనార్దనపురం, నాగవరప్పాడు, పోలీస్ కాలని, వైఎస్సార్ కాలనీ, లింగవరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ముదినేపల్లి ఏఈ పూర్ణచంద్రరావు శుక్రవారం తెలిపారు. పెదగొన్నూరు 11 కేవీ పరిధిలో మరమ్మతులు, చెట్లు తొలగింపు పనుల నిమిత్తం పెదగొన్నూరు, ఉప్పరగూడెం, విశ్వనాథ్రపాలెం, ఈడేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. గృహ, వాణిజ్య, ఆక్వా వినియోగదారులు దీనిని గమనించి సహకరించాలని కోరారు.

కైకలూరులో..

కైకలూరు: సబ్ స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం కలిదిండి మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. కలిదిండి, పోతుమర్రు, మూలలంక సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆక్రమణ తొలగింపు



ముదినేపల్లి రూరల్: స్థానిక పంచాయతీ కార్యలయం ఎదురుగా ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమించి మాంసం వ్యాపారం నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన పాకను పంచాయతీ అధికారులు శుక్రవారం తొలగించారు. ఈ ఆక్రమణల వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ప్రజలు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయగా ఈఓఆర్డీ నగేష్ ఆదేశాల మేరకు కార్యదర్శి జి రమేష్ ఆధ్వర్యంలో ఆక్రమణను తొలగించారు.

ఆధార్ కేంద్రం లేక అవస్థలు

ముదినేపల్లి రూరల్: మండలంలో కొన్ని నెలలుగా ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్థానికంగా రెండు కేంద్రాలు ఉన్నప్పటికీ పనిచేయడం లేదు. ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు ఇటీవలే ప్రభుత్వం రాతపరీక్షలు నిర్వహించగా నలుగురు అభ్యర్థులు అర్హత సాధించారు. వారికి ఇప్పటివరకు ఐడీలు కేటాయించకపోవడంతో కేంద్రాలు ఏర్పాటుచేయలేకపోయారు. దీంతో ఆధార్ నమోదు కేంద్రం కోసం ప్రజలు గుడివాడ, కైకలూరు, బంటుమిల్లి వంటి ప్రాంతాలకు వెళుతూ వ్యయప్రయాసాలకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆధార్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లు బురదమయం

పట్టించుకోని పాలకులు, అధికారులు

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా బురదమయంగా మారుతుండడంతో అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంగిలిపాకలంక నుంచి శ్రీరామ్‌నగర్ కాలనీ, నందిగామలంక, పెనుమాకలంక వెళ్లే రహదారి గుంతలలో వర్షం నీరు నిలిచిపోయి బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. వెంటనే స్పందించి ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



బురదమయంగా మారిన ఇంగిలిపాకలంక నుంచి శ్రీరామనగర్ కాలనీ మీదుగా వెళ్లే రోడ్డు

రోడ్లను అభివృద్ధి చేయాలి

అధ్వానంగా ఉన్న రోడ్లను కూటమి ప్రభుత్వం వెంటనే అభివృద్ధి చేయాలి. అధికారంలోకి రాగానే అన్ని రహదారులను నిర్మిస్తామన్నారు. ఇప్పుడు పట్టించుకున్న దాఖలాలు లేవు. రోడ్లు గుంతలమయంగా మారి వర్షం నీరు నిలవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం.

– మోరు వెంకటేశ్వరరావు, ఇంగిలిపాకలంక

రాకపోకలకు ఇబ్బంది

ఇంగిలిపాకలంక నుంచి శ్రీరామ్‌నగర్ మీదుగా నందిగామలంక, పెనుమాకలంక వెళ్లే రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే రోడ్డును అభివృద్ధి చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

– రాజేంద్రవర్మ, ఇంగిలిపాకలంక

సెక్యూరిటీ గార్డు దురుసు ప్రవర్తనపై ఫిర్యాదు

కోనేరుసెంటర్: మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో ఓ సెక్యూరిటీ గార్డు తండ్రీకొడుకులపై దాడికి పాల్పడ్డాడు. అందరి ఎదుట జరిగిన అవమానాన్ని తట్టుకోలేని బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. దాడికి పాల్పడిన సెక్యూరిటీ గార్డుపై ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బంటుమిల్లి మండలం బాసినపాడు గ్రామానికి చెందిన భట్రాజు శ్రీరాములు, నాంచారమ్మ వ్యవసాయ కూలీలు. గురువారం రాత్రి నాంచారమ్మ బాత్‌రూమ్‌లో కాలుజారి పడిపోవటంతో నడుం మీద బలమైన దెబ్బ తగిలింది. లేవలేని స్థితిలో ఉన్న ఆమెను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యుల సూచన మేరకు ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం శ్రీరాములు, కుమారుడు అయ్యప్ప కలిసి బైక్‌పై బయటికి వెళ్లి మెస్ నుంచి భోజనం తెచ్చుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఓపీ విభాగానికి ఎదుట బైక్ పార్కింగ్ చేసి లోనికి వెళ్లే క్రమంలో అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీగార్డు కిరణ్ బైక్‌ను అక్కడి నుంచి తీసి పార్కింగ్ ప్రదేశంలో పెట్టుకోవాలంటూ చెప్పాడు. క్యారేజీ లోపల పెట్టి వెంటనే బైక్‌ను అక్కడి నుంచి తీసేస్తానంటూ అయ్యప్ప బదులిచ్చాడు. దీంతో ఆగ్రహానికి గురైన సెక్యూరిటీ గార్డు అయ్యప్ప పట్ల దురుసుగా వ్యవహరిస్తూ బైక్‌ను వెంటనే తీయాలంటూ ఆదేశించాడు. ఇరువురి మధ్య వాదన పెరిగి సెక్యూరిటీగార్డు కిరణ్ సమీపంలో ఉన్న ఇటుక రాయితో అయ్యప్పను కొట్టేందుకు ప్రయత్నించాడు. తండ్రి నాగేశ్వరరావు ఇరువురిని సముదాయిస్తూ కిరణ్ చేతిలో ఇటుక రాయిని తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా తండ్రీకొడుకులిద్దరికీ గాయాలయ్యాయి. దీనిపై వారు మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని సత్కరించిన సర్పంచ్

పమిడిముక్కల: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఐనంపూడి సర్పంచ్ యేనుగ బేబి పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, గ్రామానికి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. మండలంలోని ఐనంపూడి గ్రామంలో శ్రీ కృష్ణదేవరాయ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు 10 మంది విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కమిటీ గౌరవాధ్యక్షుడు కొల్లి వెంకటప్రసాద్ మాట్లాడుతూ మూడేళ్లుగా కమిటీ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారం, విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం గ్రామానికి చెందిన అంగనవాడీ కార్యకర్తలను సత్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



ముదినేపల్లి మండలానికి సంబంధించి గ్రామ కమిటీలకు పత్రాలు అందజేస్తున్న డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి గ్రామ స్థాయిలో కృషి చేయాలని ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, స్థానిక సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కై కలూరు పార్టీ కార్యాలయంలో ముదినేపల్లి మండలం సింగరాయపాలెం, పేరూరు, పెయ్యేరు. శ్రీహరిపురం, దాకరం, పెదగొన్నూరు, మండవల్లి మండలం మండవల్లి, లోకుమూడి, అల్లినగరం, కలిదిండి మండలం కొండంగి, గుర్వాయిపాలెం గ్రామాల్లో గ్రామ కమిటీల నియామక పత్రాలను శుక్రవారం అందించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గ నాలుగు మండలాల్లో అన్ని స్థాయిలో కమిటీలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ సెక్రటరీ, ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ముదినేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రామరాజు పాల్గొన్నారు.

వరి మద్దతు ధరపై రైతుల నిరసన



బంటుమిల్లిలో ధర్నాలో పాల్గొన్న రైతులు

బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మద్దతు ధరల్లో వరి ధాన్యానికి సరైన ధర ప్రకటించలేదంటూ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో రైతు సంఘం పెడన డివిజన్ కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మినుములు తదితర పంటలకు వందల్లో ప్రకటించి వరి పంటకు కేవలం రూ.69 పెంచడం దారుణమని విమర్శించారు. పెట్టుబడులు పెరిగిపోయి వ్యవసాయం భారంగా మారుతున్న క్రమంలో ప్రభుత్వాలు సహకరించడం లేదన్నారు. క్వింటాల్‌కు రూ.3,200 పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు రైతుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌గా ఇచ్చి ఆదుకుంటున్నాయని రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మల్లేశ్వరం నీటి సంఘం అధ్యక్షుడు కె.మురళీ మోహన్, బంటుమిల్లి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.జనార్దన్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రైతు సంఘ మండల అధ్యక్షుడు ఎల్.అజయ్‌ఘోష్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

యోగ సాధన ద్వారా ఆరోగ్యం

మోపిదేవి: యోగ సాధన ద్వారా ఆరోగ్య ప్రమాణాలు పెరుగుతాయని యోగ మాస్టర్ నాగరాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం యోగ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శ్వాసప్రక్రియ, యోగనిద్ర వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవినాథ్, ప్రసాద్, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో సీఐడీ ఆఫీసర్ మృతి



అధికార లాంఛనాలతో కుమార్‌బాబు అంత్యక్రియలు

నందివాడ: గుంటూరు జిల్లా మంగళగిరిలో విధులు నిర్వహించే సీఐడీ ఆఫీసర్ నత్త కుమార్‌బాబు(35) గురువారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్వగ్రామం అయిన మండలంలోని పోలుకొండ గ్రామంలో ఆయన అంత్యక్రియలను అధికార లాంఛనాలతో శుక్రవారం నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంత్యక్రియల కార్యక్రమంలో సీఐడీ విభాగం ఎస్పీలు ప్రసాద్, ఉమామహేశ్వర రావు, నగేష్, డీఎస్పీ రమణరావు, సీఐ పూర్ణ, నందివాడ ఎస్ఐ శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.